క్లుప్తంగా

నేడు వీఎంసీలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు విజయవాడ నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రజా సమస్యలు – పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. విజయవాడ నగర వాసులకు వీఎంసీ అందించే మౌలిక వసతుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్‌కు సత్కారం



పెనమలూరు: రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ అరేపల్లి అప్పారావును రాష్ట్ర టూరిజం మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు. ఏపీ ప్రభుత్వం రాజమహేంద్రవరంలో చిత్రకళా ఉత్సవంలో భాగంగా అమరావతి చిత్రకళావీధి కార్యక్రమం ఈ నెల 4వ తేదీన నిర్వహించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు వారి చిత్రాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. పెనమలూరుకు చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ అరేపల్లి అప్పారావు రూపొందించిన చిత్రాలను కూడా ప్రదర్శించారు. అప్పారావు మాస్టర్ చిత్రీకరించిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చిత్రాన్ని ప్రశంసించి మంత్రి సత్కరించారు. ఏపీ సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ పి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో చందనోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి సందర్భంగా భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ఆదివారం చందన వేడుకలు జరిగాయి. సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం అధ్యక్షుడు బూరె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, కార్యదర్శి చందలూరి రాజశేఖర్, పీవీఎల్ ప్రసాద్, గుడివాడ విజయ్‌కుమార్, యెనిగళ్ల సుబ్బారావు, పి.రజనీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీకోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన జంగం విజయ్‌కుమార్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. భక్తి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను భక్తి తన్మయత్వంలో ముంచెత్తాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని కూచిపూడి నృత్య ప్రదర్శనలను తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన కళాకారులను సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కే వీరరాజు, కార్యదర్శి జి.సాంబశివరావు, పీ నాగమధుసూదనరావు, కే సాంబశివరావు, సీహెచ్ వెంకటసుబ్బారెడ్డి, డీ రామారావు, కే వెంకట దుర్గా రమేష్‌నాయుడు పర్యవేక్షించారు.

విజయలక్ష్మి అమ్మవారిగా కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు ఆదివారం భక్తులకు విజయలక్ష్మి అమ్మవారుగా దర్శనమిచ్చారు. విశ్వావసు నామ సంవత్సర వసంత నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్లకు 5 వేల సంపంగి పూలతో నేత్రపూర్వకంగా పుష్పార్చన నిర్వహించారు. వేదపండితుడు మార్తి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామ అర్చన, విశేష పూజలు జరిపారు. ఆధ్యాత్మిక సలహాదారుడు విజయకిరణ్ శర్మ దంపతులు అమ్మవారికి పట్టుచీరను బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్, ఆధ్యాత్మిక సలహాదారుడు విజయకిరణ్‌శర్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య కల్యాణం



నగరాల సీతారామస్వామి దేవస్థానంలో వేడుకలకు హాజరైన భక్తులు



కల్యాణోత్సవంలో మేయర్ భాగ్యలక్ష్మి, పోతిన మహేష్ తదితరులు



విజయదుర్గ ఆలయంలోని రామనవమి వేడుకల్లో భక్తులు

- అట్టహాసంగా శ్రీరామ నవమి వేడుకలు
- రామనామంతో మార్మోగిన ఆలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జగదానందకారకుడు, ఆదర్శపురుషుడైన శ్రీరామచంద్రుని కల్యాణం ఆదివారం అట్టహాసంగా జరిగింది. సమస్త మానవాళి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నవమి వేడుకలను వన్‌టౌన్‌లోని వాడవాడలా వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, పండితుల వ్యాఖ్యానాలు, భక్తుల శ్రీరామనామ నినాదాల మధ్య రామయ్య కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో లోకాభిరాముడి కల్యాణ క్రతువును పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే సుజనాచౌదరి, వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ హాజరై పూజలు నిర్వహించారు.

నయనానందకరం.. నగరాల ఆలయం..

వన్‌టౌన్ కోమలవిలాస్ సెంటర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో రాములోరి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాముని ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి, మహాసంకల్పం, కంకణధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్రబెల్లం సమర్పణ, మాంగళ్యధారణ తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాల క్రతువును భక్తులు ఆనందంతో వీక్షించారు.

రమణీయం.. కొత్తగుళ్ల ప్రాంగణం..

వన్‌టౌన్ కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీకోదండరామస్వామి వారి దేవస్థానంలో సీతాపతి కల్యాణోత్సవం అత్యంత రమణీయంగా జరిగింది. ప్రముఖ ఆగమ పండితుల ఆధ్వర్యంలో పలువురు అర్చకస్వాములు రామయ్య కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వర్ణకవచాలంకరణలో మూలమూర్తులు రమణీయంగా దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామి వారి గరుడసేవకు భక్తులు పోటెత్తారు. పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు, మురళీకృష్ణ తదితరులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో.. భావనారాయణవీధిలో..

భావనారాయణవీధిలోని శ్రీకోదండరామస్వామి వారి దేవస్థానంలో ఇనకులుడి కల్యాణోత్సవాన్ని



కొత్తగుళ్లలో విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు

భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నవమి వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ప్రత్యేక వేదికపై రామయ్య, సీతమ్మల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదుట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రామనామంతో బ్రాహ్మణవీధి..

బ్రాహ్మణవీధిలోని మల్లికార్జునపేట రావిచెట్టు సెంటర్‌లోని శ్రీరామాలయం రామనామంతో మార్మోగింది. సీతారాముల కల్యాణ క్రతువును ఆలయం ఎదుట భారీగా ఏర్పాటు చేసిన వేదికపై పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

శ్రీమహేశ్వరి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో..

పంజా సెంటర్ సమీపంలోని శ్రీ మహేశ్వరి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలోని సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఉభయదాతలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కృష్ణవేణి మార్కెట్‌లో..

పాతబస్తీలోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కెట్ ప్రాంగణంలోని రామాలయంలో రామయ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా



గరుడ వాహన సేవలో కోదండరాముడు

నిర్వహించారు. మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్ తదితరులు స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు.

రామనామం.. అంతా రామమయం!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీరామ నవిమిని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేడుకలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వాగు సెంటర్‌లో...

శ్రీవీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారాములకు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

భీమన వారి పేటలో...

భీమన వారి పేటలోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, ఆలయ అర్చకులు పసుమర్తి రామకృష్ణలు ఉభయదాతలతో క్రతువును జరిపించారు. శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన వేడుకలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు నిర్వహించారు.

సొరంగం రోడ్డులో...

చిట్టినగర్ సొరంగం రోడ్డులో శ్రీవిజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో తమ్మిన అప్పారావు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు. వేడుకలకు వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ విచ్చేసి స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెవర శ్రీను, ఇల్లిపిల్ల అప్పారావు, ఎస్వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): సీతారామ కల్యాణం లోక శాంతి సౌఖ్యాలు నెలకొనే మార్గమని, కల్యాణం చేసినా, చూసినా పుణ్య ప్రదం, పాప హరణం అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ దాసాంజనేయ కోదండరామాలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. ఆదివారం ఏలూరు లాకుల వద్ద శ్రీ సీతారామస్వామి, శ్రీ దాసంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా, రమణీయంగా నిర్వహించారు. మద్దాళీ చంద్ర శివ ప్రసాద్, సురేష్ కుమార్, రమేష్ దంపతులు ఉభయదాతలుగా కల్యాణం జరిపించగా కస్తూరి షణ్ముఖాచార్యులు, గోపీ కృష్ణమాచార్యులు మంత్రోచ్ఛారణ మధ్య బాబు పంతులు, నారాయణాచార్యులు వేడుకలను పర్యవేక్షించారు.

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక చిట్టినగర్, టైలర్‌పేట, రామాలయం వీధిలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ రమణబాబు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయ కమిటీ సభ్యులు చేపూరి నాగేశ్వరరావు, బొప్పం జాన్, దాసరి ఏసు, సిహెచ్ శ్రీనివాసరావు, భీమవరపు ప్రకాష్, గొబ్బి చంద్రరావు, అరికట్ల కొండ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కనులపండువగా శ్రీరామనవమి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఊర్మిళానగర్ 43వ డివిజన్ కనకదుర్గారెడ్డి కాలనీలో శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు వేడుకల్లో పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఆలయంలో వేడుకలు జరుగుతాయని, 10న వసంతోత్సవంతో నవమి వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

బ్యాంక్ సెంటర్ ఆంజనేయస్వామి దేవాలయంలో..

భవానిపురం బ్యాంక్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామివారి దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డితో కలిసి మాజీ మంత్రి వెలంపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని వేడుకల్లో పాల్గొన్నారు.

శ్రీపాండురంగ స్వామి సన్నిధిలో..

కొత్తపేట గణపతిరావురోడ్డులోని శ్రీపాండురంగ స్వామివారి దేవస్థానంలో శ్రీరాముని కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైఉన్న పాండురంగడుకి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ పర్యవేక్షించారు.



టైలర్‌పేటలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న హజరత్తయ్యగుప్తా తదితరులు



ప్రత్యేక అలంకరణలో కొత్తగుళ్ల కోదండరాముడు

బులియన్ మర్చంట్స్ ఆధ్వర్యంలో నవమి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని బెజవాడ జ్యూయలరీ అండ్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాతబస్తీ శివాలయం వీధిలోని కోదండ రామాలయంలో శ్రీ రామచంద్రుని కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో కన్యాదాతలుగా కప్పగంతు కౌశిక్, లక్ష్మి శ్రావణి పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొర్రా వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ జగన్ మోహనరావు, ప్రధాన కార్యదర్శి కోన శ్రీహరి సత్యనారాయణ, కోశాధికారి సాబూ పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వేడుకలకు హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కోన శ్రీహరి సత్యనారాయణ మాట్లాడుతూ.. ధర్మ సంస్థాపన, లోక కల్యాణం కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న సీతారాములు ఎప్పటికీ మనందరికీ ఆదర్శమన్నారు. ఈ నెల 13వ తేదీ వరకూ ఉత్సవాలు కొనసాగుతాయని, వచ్చే ఆదివారం అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని అధ్యక్ష, కార్యదర్శులు బొర్రా వెంకటకృష్ణారావు, కోన శ్రీహరిసత్యనారాయణ పేర్కొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సమాజానికి జ్ఞానదీపం గురువు



నాట్య కళాకారులకు యువ నాట్యగురు పురస్కారాలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: అటు సమాజంలోనూ ఇటు వ్యక్తుల్లోనూ జ్ఞానదీపం వెలిగించేవాడు గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయిరాం మహారాజ్ అన్నారు. శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, నాట్యానికి సేవలను అందించిన నాట్య గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాయిరాం మహారాజు మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు. వందే జగద్గురుం మన విశ్వాసమని వివరించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ నాట్య గురువులు సంప్రదాయ నృత్యాన్ని పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విద్యావేత్త బాదినేని రాము మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. నాట్యాచార్యులు రోహితం లక్ష్మీవాత్సల్య, నట్టు వేణుగోపాల్, జొన్నాదుల బేబీ వెన్నెల, అవ్వారు శ్రీదేవి, చెన్నా తన్మయి, దామర్ల నాగచందన, పట్టెం మేఘన, దాము చరిష్మాదేవికి యువనాట్య గురు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని నాట్యాచార్య మాగలూరి త్రినాథాచారి, సప్పా ధనలక్ష్మి నిర్వహించారు. చిన్నారులు 150 మంది ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

హోరాహోరీగా సెమీ ఫైనల్

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కొటికలపూడి గ్రామంలో అంబేడ్కర్ యూత్, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఎన్టీఆర్, ప్రకాశం జిల్లా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలను అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (అడ్మినిస్ట్రేషన్) జి.శ్రీకాంత్ ప్రారంభించారు. మూడు సెట్ల మ్యాచ్‌లో ప్రకాశం జట్టు రెండు సెట్లలో గెలిచి విజయం సాధించింది. ఒక సెట్టు గెలిచిన ఎన్టీఆర్ జట్టు ఓటమి పాలైంది.

పింఛను ఇప్పించి ఆదుకోండి సారూ !



భవానీపురం(విజయవాడపశ్చిమ): పింఛను ఇప్పించి ఆదుకోండి సారూ.. అంటూ బత్తుల రత్తాలు అనే వితంతువు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిని వేడుకుంది. ఆదివారం విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన దగ్గరకు ఆమె వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. తన భర్త బత్తుల అంకాలు కొన్నేళ్లుగా వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నాడని.. ఆయన 7 నెలల క్రితం మరణించారని ఆయనకు తెలియజేసింది. ఆయనకు ఇచ్చే పింఛను తన పేరు మీద బదలాయించి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా.. లాగిన్ ఇంకా ఓపెన్ అవ్వలేదని, అయిన తరువాత ఇస్తామని చెప్పారని ఎమ్మెల్యే సుజనా చౌదరికి వివరించింది. ప్రస్తుతం తనకు ఎవరూ లేరని, మొన్నటి వరకు భర్తకు ఇచ్చిన పింఛన్‌ను తనకు ఇస్తే ఎలాగోలా బతుకుతానని కన్నీటి పర్యంతం అయ్యింది.

క్రీడాప్రాంగణం అభివృద్ధికి సహకరించండి

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిశోర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.50 వేలు చొప్పున విరాళం ఇచ్చిన కంభంపాటి సూర్యచంద్రరావు, టీఎస్ఆర్‌కే.ప్రసాద్‌ను వాకర్స్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ.. అభివృద్ధికి దూరంగా ఉన్న క్రీడా ప్రాంగణాన్ని వాకర్స్, దాతల సహకారంతో వసతులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు, బెడ్‌టైల్స్, వాలీబాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్తగా బోర్‌వేల్ ఏర్పాటు, టాయిలెట్స్ నిర్మాణం, ట్రాక్ బలోపేతం పనులు చేపట్టినట్లు వివరించారు. క్రీడా ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం వల్ల పెద్ద సంఖ్యలో వాకర్స్, క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం జీఎస్.రవిబాబు, వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన తిరివీధి వెంకయ్య, చిమట రామారావు, ఎలీషా దేవసహాయం, చిల్లపల్లి శ్రీనివాసరావు, కేఎస్.జగదీశ్వరరావు, వీసం ప్రసాదరావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యచంద్రరావును సత్కరిస్తున్న వాకర్స్

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు చేయడంతో నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన తానేటి చంద్రమ్మ ఇళ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త 18 ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఆమెకు 17 ఏళ్ల కుమార్తె ఉంది. ఈనెల 3వ తేదీన కూరగాయాలు తీసుకురావడానికి బయటకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు సిద్ధార్థలో ఈకాన్ - 2కే25



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తమ కళాశాల స్టూడెంట్స్ ఆఫ్ ఎకనామిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈకాన్ – 2కే25 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో ఎకనామిక్స్ చదువుతున్న విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాల ఆవరణలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 2015 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మధుబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. స్టార్టప్ ఐడియా (అంకురాలోచన), వక్తృత్వం, క్విజ్, పోస్టర్ రూపకల్పన వంటి పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈకాన్ – 2కే25 కార్యక్రమ కన్వీనర్ సీహెచ్‌వీ.రోహిణి కుసుమతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.